ప్రజారోగ్యానికి సీఎం జగన్ భరోసా

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఆకివీడు, జక్కరంలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


ఆకివీడు సభలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


జక్కరంలో ఓ మహిళకు ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న పీవీఎల్

ఆకివీడు: ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తూ ఆరోగ్యశ్రీ లబ్ధి పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పీవీఎల్ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకాన్ని చంద్రబాబు ప్రభుత్వంలో అడ్రస్సు లేకుండా చేశారని, ప్రజలు ఆర్థిక బాధలతో, అనారోగ్యంతో బాధపడుతున్నా పట్టించుకోలేదన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజల వద్దకే వైద్యులు వచ్చి వైద్య సేవలందిస్తున్నారని, ఫ్యామిలీ డాక్టర్, నర్సులు, వైద్యులు నిత్యం గ్రామాల్లో తిరుగుతున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. మీ ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్ మళ్లీ కావాలా, ఆరోగ్యశ్రీని రద్దు చేసి, ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలివేసే ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలో ఆలోచించుకోవాల్సిన తరుణం వచ్చిందన్నారు. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ సీఎంగా అవకాశం ఇస్తే ఆరోగ్యమే కాదు, మీ ఆర్థిక స్థితిగతులు మరింతగా మెరుగుపడతాయన్నారు. పట్టణ పరిధిలో 10 వేలకు పైగా ఆరోగ్యశ్రీ కార్డుల్ని పంపిణీ చేస్తున్నామని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, వ్యవసాయ సలహా మండల కమిటీ అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రమేష్, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, కౌన్సిలర్లు నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, గేదల అప్పారావు, పట్టణ యూత్‌కమిటీ అధ్యక్షులు జోగి నాగరాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, ఎస్కే. ఆరీఫ్, మన్నే పోతరాజు, కమిషనర్ జీ.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పేదల కష్టాలు తెలిసిన ఏకైక సీఎం జగన్

కాళ్ల: పేదల కష్టాలు తెలిసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. జక్కరంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీవీఎల్ మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నారన్నారు. ఏ ఒక్కరు వైద్యం పొందేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని లక్ష్యంతో గతంలో రూ.ఐదు లక్షలుగా ఉన్న ఉచిత వైద్యం పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదల ఆరోగ్యానికి భరోసానిస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడ లేరని, ఆయన పాలనలో పేదలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ఆరోగ్యంగా ఉంటున్నారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజల కోసం నిత్యం ఆలోచించే సీఎం వైఎస్ జగన్ వెంట ప్రజలంతా నడవాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి వైద్య సేవలు అందించే మహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగన్ ఆదర్శప్రాయులన్నారు. ప్రతి పేదవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవాలని కోరారు. ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయరామ కృష్ణంరాజు, మన్నే నాగరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలంతా రుణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉండి నియోజకవర్గంలో నిత్యం ప్రజల వెంటే ఉంటున్న పీవీఎల్ నరసింహారాజును అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. గ్రామ ఉప సర్పంచ్ కూచింపూడి లక్ష్మీపతిరాజు, పార్టీ నాయకులు వీరమల్లు బోసు, నాగరాజు, సతీష్, పెనుమత్స రంగరాజు, ఈఓ పీఆర్‌డీ భాస్కరరావు డాక్టర్ రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కేంద్ర పాలిత ప్రాంతమైన యానానికి చెందిన మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు వ్యక్తిగత పనులపై వారతిప్ప గ్రామం వచ్చి ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు రావడంతో ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రీస్తు బోధనలు ఆచరించాలి


ఆచంట చిన పేటలో క్రిస్మస్ వేడుకల్లో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రతి ఒక్కరూ పరోపకారిగా ఉంటూ శాంతిస్థాపనకు క్రీస్తు బోధనలు ఆచరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం రాత్రి ఆచంట చినపేట పరిశుద్ధ మార్కు లూథరన్ దేవాలయంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్ కుమార్, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో భవానీ మాలధారుల గ్రామోత్సవం


సిద్ధాంతంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భవానీ మాలధారులు

పెనుగొండ: సిద్ధాంతంలో భవానీ మాలదారుల గ్రామోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామునే వశిష్టా గోదావరిలో స్నానాలు అనంతరం అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గురు భవానీ మూడేళ్ల శ్రీను ఆధ్వర్యంలో 50 మంది భవానీ మాలధారులు అమ్మవారి వేషధారణలతో జై దుర్గ, జైజై దుర్గ నామస్మరణతో గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భవానీ మాల ధారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరాలి

పాలకొల్లు అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సెంట్రల్ టీమ్ పరిశీలకులు, ఫిషరీస్ సైంటిస్ట్ జీవీఏ ప్రసాద్ కోరారు. మండలంలోని వెంకటాపురం, పాలమూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం ప్రయోజనాలు ప్రజలకు వివరించారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షలు విలువ చేసే వైద్యం ఉచితంగా పొందవచ్చన్నారు. మన రాష్ట్రంలో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు. సర్పంచ్ పంచదార స్వామి నాయుడు, ఉప సర్పంచ్ తాడిపర్తి వరప్రసాద్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్యజీవన్, పశువైద్యాధికారి డాక్టర్ వరప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ ఎలిజబెత్, కార్యదర్శి ఎం.నాగదిలీప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.మంగ తదితరులు పాల్గొన్నారు.

రంగా, శ్రీకృష్ణ దేవరాయల విగ్రహాల ఆవిష్కరణ


సభలో మాట్లాడుతున్న వంగవీటి రాధా

ఆకివీడు: యువత ఆదర్శవంతమైన పౌరులుగా తయారుకావాలని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధ పిలుపునిచ్చారు. మండలంలోని పెదకాపవారం గ్రామంలో దివంగత వంగవీటి మోహనరంగారావు, శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాధా మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. వంగవీటి మోహన్ రంగారావు పేద వర్గాలు, కార్మికులు అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు కాబట్టే ఆయన ఇప్పటికీ ప్రజల హృదయాల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు నెరవేర్చే విధంగా యువత ముందుకు వెళ్లాలన్నారు. యువత ఆర్థికంగా బలోపేతమైనప్పుడే రాజకీయాల వైపు చూడాలన్నారు. కార్యక్రమంలో పీవీఎల్ నర్సింహరాజు, మంతెన రామరాజు, ఎంపీపీ కటారి జయలక్ష్మి, కట్రెడ్డి మోహన్‌రావు, సుధాకర్ కేశవరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న లక్ష్మీనారాయణుడి అలంకరణ


ప్రత్యేకాలంకరణలో అష్టభుజ లక్ష్మీనారాయణుడు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం (చినగోపురం)లో ధనుర్మాస పూజల్లో భాగంగా 8వ రోజు ఆదివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం వీణా గానం, పాశుర విన్నపం, మాల మార్పు, పూల జడ కైంకర్యం, పాశురార్థ వివరణ, టీటీడీ వారి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారిచే తిరుప్పావై ప్రవచనం నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, పవన్‌స్వామిల బ్రహ్మత్వంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు కొల్లేపల్లి నాగవెంకట రవికిరణ్, అద్దంకి సాయి వెంకట తేజలు స్వామివారికి పుష్పాలంకరణ, ప్రసాద వితరణ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జవ్వాది పానకాలు, కార్యనిర్వహణాధికారి పెదపల్లి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కొవ్వాడ అన్నవరం చర్చిలో ప్రసంగిస్తున్న బ్రదర్ సమూయేలు


ఎన్నార్పీ అగ్రహారంలో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తున్న చర్చి సభ్యులు

భీమవరం అర్బన్: పాపులను రక్షించడానికై ఏసు ప్రభువు భూమిపై అవతరించి ఎన్నో కష్టాలు పడ్డారని బ్రదర్ కె.సమూయేలు ప్రసంగించారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరంలో బీవీ రాజు కాలనీలో ఆదివారం పరిశుద్ధ క్రీస్తు దేవాలయంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ సమూయేలు మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమని అన్నారు. అనంతరం క్రైస్తవ గీతాలపనలు చేసి కేక్ కట్ చేసి అందరికి పంచారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ పి.ప్రసాదరాజు, డి.సరోజిని, తాళ్లూరి ఆశీర్వాదం, ఆర్ భారతి, కృష్ణ, తంబయ్య, రవి, యేసు రాజు, సండే స్కూల్ పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా క్రిస్మస్ క్యారల్స్

ఉండి: క్రిస్మస్ పండుగను మండలంలో క్రైస్తవులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున నిర్వహించిన క్రిస్మస్ క్యారల్ ఆద్యంతం ఆకట్టుకుంది. క్రిస్మస్ తాత వేషధారణలతో, ఆర్కెస్ట్రా, బాణసంచా కాల్పులతో ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ క్యారల్స్ ఎంతో ఆసక్తిగా సాగింది. గ్రామంతో పాటు ఉండిలోని ప్రధాన కూడళ్ళల్లో క్యారల్స్ నిర్వహించారు. పేరిష్ పాస్టర్ వీ నెహ్రూ, అడిషినల్ పాస్టర్ ఎం.మార్కురాజు, సంఘ సీఆర్‌పీ కరుణాకరరావు ఆధ్వర్యంలో స్థానిక చర్చ్ ప్రతినిధులు పాల్గొన్నారు. పాస్టర్ నెహ్రూ, మార్కురాజు మాట్లాడుతూ క్రిస్మస్ ప్రత్యేకతను వివరించారు. క్రీస్తు ఆరాధనలో క్రైస్తవులు పాల్గొని పరిశుద్ధ హృదయంతో ప్రార్థించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు గుమ్మడి అమృతరావు, ఆలమూరి శ్యాంబాబు, చుక్కా శేఖర్, ముత్యం స్వరూఫ్‌కుమార్, పీసీసీ సకిలే వెంకట్, చిగురుపాటి కర్నేలు, కోశాధికారి పీ ప్రశాంత్‌కుమార్, కార్యదర్శి ముత్యం అనీల్‌కుమార్, యూత్, స్త్రీల సమాజం, సండే స్కూల్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

'గడపగడపకు' నిధులతో మౌలిక వసతులు

ఆకివీడు: నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాల్ని వేగంగా కల్పిస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని అజ్జమూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించే పక్కా డ్రెయిన్ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించామని చెప్పారు. అజ్జమూరు గ్రామంలో రూ.15 లక్షల గడపగడపకు నిధులతో, దాతల విరాళాలు రూ.25 లక్షల వ్యయంతో 1200 మీటర్ల మేర డ్రెయిన్ నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వానపల్లి బాబూరావు, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, సర్పంచ్ చెలంకూరి చలపతిరావు, కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్, శింగులూరి నాగేశ్వరరావు, మంచ్యాల నానాజీ, తోట రాంబాబు, దుర్గారావు, సందన చిన్నా, ముత్యాల రామూర్తి, తోట సీతారామయ్య, జీ.ధనరాజు, షద్రక్, హుస్సేన్, కుర్రెళ్ల పోలు తదితరులు పాల్గొన్నారు.


అజ్జమూరులో డ్రెయిన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పీవీఎల్

అంకితభావంతో పనిచేస్తే పార్టీలో గుర్తింపు

భీమవరం అర్బన్: వైఎస్సార్ సీపీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి పదవులు అవే వరిస్తాయని పార్టీ మండల కన్వీనర్, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ అన్నారు. గూట్లపాడులో మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన జవ్వాది గణేష్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుమాని ఏడుకొండలు, కోడే యుగంధర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలను అధిష్టానం గుర్తించి పదవులతో బాధ్యతలను అప్పగించి గౌరవిస్తుందన్నారు. నూతనంగా మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన జవ్వాది గణేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, ఉప సర్పంచ్ కొప్పర్తి సూరిబాబు, జవ్వాది సత్తిబాబు, గాదిరాజు రామరాజు, రెడ్డి సురేష్, కొప్పర్తి ప్రసాద్, సుబ్బారావు, కొప్పినేని ఆదినారాయణ, యాతం త్రిమూర్తులు, రామాయణ బుజ్జి, జవ్వాది హరిబాబు పాల్గొన్నారు.


గూట్లపాడులో జవ్వాది గణేష్‌ను జ్ఞాపిక అందజేసి అభినందిస్తున్న తిరుమాని ఏడుకొండలు, కోడే యుగంధర్

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

భీమవరం: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అన్నారు. 2019–23 బ్యాచ్‌కు చెందిన 775 మంది బీటెక్, 2021–23 బ్యాచ్‌కు చెందిన 22 మంది ఎం.టెక్ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్టార్టప్‌లపై దృష్టి సారించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ దేశాభివృద్ధికి దోహదపడాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న దృశ్యం

26న బాలల హృద్రోగ వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో మంగళవారం ఉదయం పిల్లల్లో గుండె వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ సహకారంతో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ 15 ఏళ్ల లోపు వయసు ఉన్న పిల్లలను పరిశీలించి ఉచిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వైద్య శిబిరాన్ని భీమవరం పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ప్రసాదరాజు కోరారు.

గీత కార్మిక సంఘం కార్యవర్గం ఎన్నిక

భీమవరం: ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కామన మునిస్వామి, జుత్తిగా నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎస్ఆర్ దాట్ల నగర్‌లో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మామిడి శక్తి, మామిడిశెట్టి నాగభూషణం, కడలి పాండు, సహాయ కార్యదర్శులుగా బొంతు శ్రీనివాసు, దాసరి సూరిబాబు బొక్క చంటి ఎన్నికయ్యారు. మరో 18 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో కమిటీ ప్రతినిధులు తెలిపారు.

'ఎస్ఆర్‌కేఆర్'లో ముగిసిన సదస్సు


అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం

భీమవరం: అల్గారిథమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధనలు చేసే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం పెద్ద ఎత్తున నిధులు అందిస్తోందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఐటీ వరంగల్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌బీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అల్గారిథమ్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఐసీఏఏఏఐ–2023) అనే అంశంపై మూడు రోజులపాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి కొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. జేఎన్టీయూకే కాకినాడ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హెచ్ ఎం కృష్ణప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ నగేష్ బట్టు ఎస్, డాక్టర్ కేఎస్‌వీ జగన్‌మోహన్, డాక్టర్ గుప్తా పాల్గొన్నారు. సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు డాక్టర్ సుబ్రమణ్యం సర్టిఫికెట్లు అందజేశారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం



సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): హిందు సంస్కృతి సంప్రదాయాలలో పండుగలు ప్రధాన భాగమని, వీటిలో సంక్రాంతి పండుగ ముఖ్యమైనదని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు యోగ అధ్యాపకులు కలిగొట్ల గోపాల శర్మ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పంచముఖ ఆంజనేయ స్వామి వేదిక వద్ద సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. పూజాదికాలు నిర్వహించిన డాక్టర్ ఎం.గోవిందబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే ప్రాంతంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని, భీమవరంలోనే సంక్రాంతి సంబరాలు మొదటగా ప్రారంభమవుతాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు సంప్రదాయబద్ధంగా ప్రారంభించామని, అన్ని పాఠశాల, కళాశాలలు, వృద్ధాశ్రమంలో, సేవా కేంద్రంలో జనవరి 12 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని, వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామన్నారు. అనంతరం గొబ్బిళ్ల పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్కే చాన్ బాషా, తోట శరత్ బాబు, జన్మభూమి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భీమవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని యూరో కిడ్స్ ప్రిన్సిపాల్ కలిదిండి రవి వర్మ తెలిపారు. భీమవరం ఎస్‌సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్లో యూరో కిడ్స్ హెల్త్ ఈజ్ వెల్త్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తి కనబర్చాలనే ఉద్దేశంతో 12 విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం ప్లే గ్రూప్ చిన్నారులకు జెల్లిస్ ఆన్ థ గో, బెలూన్ రన్, ప్లాట్రింగ్ వింగ్స్, నర్సరీ చిన్నారులకు రింగింగ్ బెల్స్, బాల్ ట్రాన్స్‌ఫర్, బీడేక్కడ్ తడ్డి, యూరో జూనియర్స్‌కు అప్ అప్ అండ్ అప్, ఆర్నట్, బిల్డ్ సార్ట్ మ్యాచ్, యూరో సీనియర్స్‌కు మమ్ అండ్ బేబీ, ఫైండ్ థ హోల్, సక్ హోల్డ్ డ్రాప్ అనే విభాగాల్లో పోటీలను నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా ఈ పోటీల్లో పాల్గొని చూపరులను ఆకట్టుకున్నారు. డీఎన్నార్ కళాశాల నరసింహరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ధర్నా


ఉండి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న చిలుకూరు గ్రామస్తులు

ఉండి: పోలీసులు వేధిస్తున్నారంటూ చిలుకూరు గ్రామానికి చెందిన కొందరు ఉండి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి బైఠాయించి ధర్నాకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. చిలుకూరులో ఈ నెల 21వ తేదీన తమ ఇంట్లో దొంగతనం జరగగా, దీనిపై ఫిర్యాదు చేస్తే తమనే పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. తాము చెప్పినట్టే ఫిర్యాదు చేయాలని లేకుంటే ఇబ్బంది పడతారని పోలీసులు బెదిరిస్తున్నారని వాపోతున్నారు. చోరీ కేసుపై ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచినా కేసులో పురోగతి లేకపోగా ఫిర్యాదికి అండగా నిలుస్తున్న చిలుకూరు గ్రామ క్రైస్తవ సంఘ పెద్దలను ఏఎస్సై ఎ.సూర్యనారాయణ ఫోన్ చేసి బెదిరించారని ఆరోపించారు. దీంతో ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు గ్రామస్తులు తరలివచ్చారు. తమ సంఘంలో ఒకరికి అన్యాయం జరిగి ఫిర్యాదు చేస్తే దానిని పట్టించుకోకుండా ఓ పాతనేరస్తుడికి కొమ్ము కాయడమే కాక తమను బెదిరించడం దారుణమంటూ పోలీసుల వైఖరిని ఎండగట్టారు. బంగారం, సొమ్ము పోగొట్టుకుని తాము బాధలో ఉంటే పోలీసులు తమనే బెదిరిస్తుండటం వారి వైఖరి అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న సీఐ సత్యనారాయణ వారితో ఫోన్ ద్వారా మాట్లాడి సోమవారం చిలుకూరు వచ్చి మాట్లాడతానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

వేడుకగా హనుమద్ వ్రతం

పెనుగొండ: సిద్ధాంతం విజయ గోపాలస్వామి ఉపాలయంలోని సువర్చలా సమేత శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ వ్రతం వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవల్లి సీతారామాచార్యుల బ్రహ్మత్వంలో పంచామృతాభిషేకం, తమల పాకులు, సిందూరంతో సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం వీరవల్లి రిషితేజ నారాయణ, జయచంద్రులచే కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి పుష్పబాను ఏర్పాట్లు పర్యవేక్షించారు.